క్లుప్తంగా...

గుండెపోటుతో సీనియర్ జర్నలిస్ట్ మృతి


కోదండ రాంప్రసాద్ (ఫైల్)

సాక్షి,సిటీబ్యూరో : సీనియర్ పాత్రికేయులు ఎం.కోదండ రాంప్రసాద్ (65) శనివారం పీర్జాదిగూడలోని తన నివాసంలో గుండెపోటుతో మరణించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పీర్జాదీగూడలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన ప్రజాశక్తి, ఆంధ్రపత్రిల్లో వివిధ హోదాల్లో పని చేశారు. కోదండ రాంప్రసాద్ మృతికి పలువురు జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు.

మున్నూరు కాపు ట్రస్ట్ మెంబర్‌గా రవి కుమార్

రామంతాపూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోకాపేట్‌లో కేటాయించిన మున్నూరు కాపు ఆత్మ గౌరవ భవనం ట్రస్ట్ బోర్డు మెంబర్ రామంతాపూర్‌కు చెందిన ఎడ్ల రవికుమార్ పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ రాజ్యసభ సభ్యులు వద్ది రాజు రవి శనివారం రవికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మున్నూరు కాపు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసేంత వరకు సంఘటితంగా పోరాడతామన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: ఇటీవల జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం నాచారం పారిశ్రామిక వాడలోని శ్రీకరి బయోటెక్ కంపెనీలో 200 మంది ఉద్యోగులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఫోన్‌లకు అపరిచిత వ్యక్తులు పంపించిన మేసేజ్‌లకు స్పందించకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ.సారంగపాణి, కంపెనీ ఎండీ లింగ శ్రీనివాస్, డైరెక్టర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు సత్కారం



బోడుప్పల్: ఈస్ట్ హనుమాన్‌నగర్‌కు చెందిన సీనియర్ సిటిజన్స్ పోలోజు వెంకటాచారి, ధనలక్ష్మి దంపతుల పుట్టిన రోజును పురస్కరించుకుని వారిని, వెంకటాచారి మాతృమూర్తి లలితమ్మలను శనివారం ఆకాలనీవాసులు సత్కరించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పుటకండ్ల జంగారెడ్డి, కాలనీవాసులు రమేష్ కుమార్, డాక్టర్ నరిసింహ పాల్గొన్నారు.

పర్యావరణ హిత జీవన శైలిపై అవగాహన కార్యక్రమం



మల్లాపూర్: పర్యావరణ హిత జీవన శైలిపై శనివారం కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ ప్రారంభించారు. ఇళ్లలో ఉండే వ్యర్థ వస్తువులు ఇవ్వాలన్నారు. కాప్రా డిప్యూటీ కమీషనర్ శంకర్, జవాన్ కృష్ణ, ఎస్ఎఫ్ఏలు రాజేష్, యాకస్వామి, శానిటేషన్ సిబ్బంది, ఆర్పి భాగ్య తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్


జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి కలిసి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం వినతి పత్రం అందజేశారు. మల్లాపూర్ వార్డు కార్యాలయం పై అంతస్తులో మల్టీపర్పస్ మీటింగ్ హాల్, దుర్గానగర్, బాబానగర్ సీసీ రోడ్లు, సూర్యనగర్ దోభీఘాట్‌లో షెడ్, రిపేర్, కంపౌడ్ వాల్ తదితర పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

గీత కార్మిక కోఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం

అల్వాల్: పాత అల్వాల్ గీత కార్మిక కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు శనివారం జరిగాయి.ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడిగా ఎర్రవల్లి ఆంజనేయులు గౌడ్, ఉపాధ్యక్షుడిగా కాట వేణుగోపాల్ గౌడ్, కార్యదర్శిగా నేమూరి సాయిరాంగౌడ్,డైరెక్టర్లుగా నేమూరి శరత్‌గౌడ్, గొట్టిముక్కల సుధాకర్ గౌడ్ ఎన్నికయ్యారు. గీత కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ తెలిపారు.

ధ్రువపత్రాల కోసం తిప్పలు

- విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ధ్రువపత్రాలు తప్పనిసరి
- ధ్రువీకరణ పత్రాల జారీలో లోపించిన పారదర్శకత
- కుల, ఆదాయ, ఓబీసీ సర్టిఫికెట్ల కోసం మీ-సేవ కేంద్రాలు, రెవెన్యూ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- గ్రేటర్‌తోసహా శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలలో 58 మండలాలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాల (ధ్రువీకరణ సర్టిఫికెట్లు) జారీలో పారదర్శకత లోపిస్తోంది. వివిధ విద్యాసంస్థల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందే సమయం కావటంతో ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ కేంద్రాలు, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గ్రేటర్‌తోసహా శివారులో మొత్తంగా (హైదరాబాద్ జిల్లాలో16, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 15,రంగారెడ్డి జిల్లాలో27) 58 మండలాలు ఉండగా, కొన్ని మండలాల్లో ఈ ప్రక్రియ సజావుగా సాగుతుంటే.. మరికొన్ని చోట్ల నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్న పరిస్థితులు క్షేత్రస్థాయిలో కొనసాగుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

◆ పాత ధ్రువ పత్రాలు ..

ధ్రువపత్రాల జారీలో కొందరు తహసీల్దార్లు పాత ధ్రువపత్రాలను జత చేయాలని కోరుతున్నారు. ఉదాహరణకు కమ్యూనిటీ సర్టిఫికెట్ కావాలంటే పాతది జత చేయాలని సూచిస్తున్నారు. అది లేకుంటే కుటుంబంలో ఎవరిదైనా తీసుకురమ్మంటున్నారు. లేకుంటే కొత్తవి ఇవ్వడం లేదు. నిబంధనల ప్రకారం ఏ పాత ధ్రువీకరణ పత్రాలు జత చేయాల్సిన అవసరం లేదు.

◆ నిరాకరణ..

గ్రేటర్‌తోసహా శివారులోని పలు మండలాల్లో ఫ్యామిలీ మెంబర్ (కుటుంబ సభ్యుల) ధ్రువపత్రాలను తహసీల్దార్లు జారీ చేయడం లేదు. కొన్నిచోట్ల మాత్రం మాన్యువల్‌గా ఇస్తున్నారు. ఇవి అన్నిచోట్ల చెల్లటం లేదు. ఫ్యామిలీ మెంబర్ ధ్రువపత్రాలతో న్యాయస్థానాల్లో కేసులు వేస్తున్నారనే కారణంగా వీటి జారీకి రెవెన్యూ అధికారులు విముఖత వ్యక్తంచేస్తున్నట్లు తెలుస్తోంది.

◆ ముందే చేయించాలట..

కుల, ఆదాయ, నివాస, ఓబీసీ తదితర ధ్రువపత్రాల జారీ కోసం మీ- సేవ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేద్దామంటే..కొందరు నిర్వాహకులు నేరుగా తీసుకోవడం లేదు. ముందుగా ఆఫారాలపై ఆర్ఐతో సంతకం చేయించాలంటున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. దీంతో చేసేదేమీ లేక సదరు అధికారి కోసం తహశీల్దార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందంటున్నారు. సంతకం పూర్తయ్యాక మళ్లీ మీ-సేవకు వెళ్లి దరఖాస్తు చేసి, తిరిగి సదరు ఫారాలను తహశీల్దార్ కార్యాలయంలో అందజేస్తున్నారు. వాస్తవంగా ధ్రువపత్రాల నిమిత్తం ఎక్కడైనా మీ- సేవలో దరఖాస్తు చేసుకోవచ్చు. సదరు ఫారాలపై ముందస్తుగా ఏ అధికారి సంతకం అవసరం లేదు. దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యాక సదరు ఫారాలను తహశీల్దార్ కార్యాలయంలో అప్పగించాల్సిన బాధ్యత కూడా మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు చేయాల్సి ఉంటుంది.

◆ అన్నీ తామై..

మీ-సేవ నుంచి వెళ్లిన దరఖాస్తులను ఆర్ఐ, తహసీల్దార్ లాగిన్లలో ఓకే చేసిన తర్వాత ఆపరేటర్ ఓకే చేయాలి. కానీ అధికారులు పనుల్లో తీరిక లేకుండా ఉండటంతో వాటిని ఆపరేటర్లకు అప్పగిస్తున్నారు. ఇది వారికి కలిసి వస్తోంది. అన్నీ తామై నడిపిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత


చక్రిపురంలో అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం చక్రిపురం కాలనీ సంక్షేమసంఘం భవనంలో రెడ్యూస్.. రీయూజ్..రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) అనే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు రోడ్లపై విచ్చలవిడిగా పడవేయకుండా నిర్ధేశించిన స్థలాల్లో వేసి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం కాలనీవాసులతో కలిసి పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కాలనీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, అశోక్, శ్రీకాంత్‌యాదవ్, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీకాలనీలో..

పర్యావరణ పరిరక్షణ కోసం తలపెట్టిన ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని శనివారం జీహెచ్ఎంసీ అధికారులు హెచ్‌బీకాలనీలోని మోడల్ మార్కెట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ప్రభుదాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే


ఉప్పల్‌లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి శనివారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రశాంత్‌నగర్ బీరప్పగడ్డ, ఓఆర్ఆర్ ఫేజ్-2 రెండవ విడత తాగునీరు పైపులైన్ పనులను ప్రారంభించారు. వీటితో పాటు సీతారామ కాలనీలో రూ. 18 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్కిల్ ఈఈ నాగేందర్, ఏఈ రాజ్‌కుమార్, జలమండలి మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను తీర్చండి..


భరత్‌నగర్‌లో ప్రజాదర్బార్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, భరత్‌నగర్‌లో నెలకొన్న మంచినీటి సమస్యను తక్షణమే తీర్చాలని లేదంటే ఆందోళనకు వెనుకాడమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ప్రజాదర్బార్‌లో భాగంగా ఆయన శనివారం భరత్‌నగర్‌లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గత 20 రోజులుగా భరత్‌నగర్ కాలనీవాసులు మంచినీరు లేక పడుతున్న ఇబ్బందులను ఆయన తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. మంచినీటి సమస్యకు గల కారణాలు తెలుసుకున్నారు. రెండు రోజుల్లో సమస్య తీరుతుందని అధికారులు సమాధానం చెప్పారు.

సీఎం కుటుంబసభ్యులకే మాత్రమే బంగారు తెలంగాణ

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్‌కు చెందిన పలువురు యువకులు, మహిళలు శనివారం కమలానగర్‌లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులకే మాత్రమే బంగారు తెలంగాణ అని, నిరుద్యోగ యువతకు నిరాశ ఎదురవుతోందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం, పేపర్ లీకేజీ, ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, టీఎస్‌పీఎస్‌పీ పేపర్ల లీకేజీలతో యువత జీవితాన్ని నాశనం చేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో సంపత్, సోమేశ్వర్ నాయుడు, శ్రీకాంత్, మనీషా, కనకయ్య, రామనాథన్, వెంకట్‌గౌడ్, హరిప్రసాద్, వీరేందర్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


సిబ్బందికి కిట్స్ అందజేస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ భూతం లాంటి వాటిపై శనివారం ఉప్పల్ జీహెచ్ఎంసి అధికారులతో కలిసి నిర్వహించిన కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. వ్యర్థాలను తిరిగి ఉపయోగకరంలోకి తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణ, అనిల్ కుమార్, అల్వాల బాస్కర్, రుతమ్మ, సుశీల, అనిత తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్ డివిజన్‌లో...

పర్యావరణ పరిరక్షణ దినోత్సవాలలో భాగంగా చిలుకానగర్ డివిజన్‌లో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభించారు.

బేతేల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ర్యాలీ



మౌలాలి: వినాయక్‌నగర్ బేతేల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో చిన్నారులకు గత పది రోజుల నుండి సమ్మర్‌క్యాంపు నిర్వహించారు. చివరి రోజు శనివారం చిన్నారులకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం పాస్టర్ సుకుమార్ ఆధ్వర్యంలో చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేరెడ్‌మెట్ ఎస్ఐ ప్రభాకర్, సెర్ల అనిల్, శంకర్, పాల్, మ్యాత్యు, రాజు, మెజోస్, రంజిత్, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

కాప్రా సర్కిల్ ఏఎల్‌వో, వీవో, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ


కాప్రా: కాప్రా సర్కిల్‌లోని ఏఎల్‌వో, వాల్యుయేషన్ అధికారులు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వాల్యుయేషన్ అధికారి సురేందర్‌గౌడ్ సంతోష్‌నగర్ సర్కిల్‌కు, సూపరింటెండెంట్ క్యాడర్‌లో ఉన్న ఇన్‌చార్జి వాల్యుయేషన్ అధికారి నాగేందర్ ఎల్బీనగర్ సర్కిల్‌కు, ఇన్‌చార్జి వాల్యుయేషన్ అధికారి ఎస్.యాదగిరి సరూర్‌నగర్ సర్కిల్‌కు, ఇన్‌చార్జి అసిస్టెంట్ లైసెన్స్ అధికారి నర్సింగ్‌రావు ఉప్పల్‌కు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సుధాకర్ హయత్‌నగర్‌కు, నర్సింగ్‌రావు సరూర్‌నగర్ సర్కిళ్లకు బదిలీ అయ్యారు. అదేవిధంగా వీరి స్థానంలో సరూర్‌నగర్ సర్కిల్ నుండి షహనాజ్, ఉప్పల్ సర్కిల్ నుండి పి.రాజు, ఎల్బీనగర్ నుండి ఎం.సుధాకర్, సరూర్‌నగర్ సర్కిల్ నుండి సదానంద్, ఎల్బీనగర్ నుండి విజయ్‌రాజులు బదిలీపై కాప్రా సర్కిల్‌కు వచ్చారు.

ఖబరస్థాన్ స్థలాన్ని అప్పగించాలి


జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ప్రవీణ్ తదితరులు

ఉప్పల్: ఉప్పల్‌లోని దర్గా మదీనా హుస్సేన్ ఖబరస్థాన్ స్థలాన్ని తిరిగి అప్పగించాలని కోరుతూ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, దర్గా కమిటీ అధ్యక్షులు అన్సారిలు శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనేక సంవత్సరాలుగా ముస్లిం మైనార్టీ సోదరులకు ఖబరస్థాన్‌కు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సింహనందిని నాట్యాలయ గురువు మార్కండేయ శర్మ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్యం అలరించింది. బ్రహ్మాంజలి, మహాగణపతిమ్, జతిస్వరం, కళ్యాణరామ, పుష్పాంజలి, నటేశకౌతం, అలరిపు,సతులారా తదిర అంశాలను నక్షత్ర, కీర్తన, శర్మ, సుకృతి తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

వినాయక్‌నగర్‌లో ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం


వినాయక్‌నగర్‌లో ఆర్ఆర్ఆర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ ప్రధాన రోడ్డు బస్టాప్‌లో ఏర్పాటుచేసిన ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) సెంటర్‌ను శనివారం డిప్యూటీ కమిషనర్ రాజు, కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత పుస్తకాలు, బట్టలు, పనికిరాని వస్తువులు ఉంటే ఈ సెంటర్‌లో ఉంచాలన్నారు. ఈ వస్తువులను జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది ఎవరికైనా అవసరం ఉన్నవారికి ఇవ్వడం లేదా రీసైక్లింగ్ చేస్తారన్నారు. ఏఎంహెచ్‌వో, బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, శ్రీధర్‌రావు, మహేష్, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, జవాన్లు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

యువకుడికి దేహశుద్ధి

ఆల్వాల్: అమ్మాయిలను వేధిస్తున్న యువకుడిని స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. ఆల్వాల్‌లో కాలేజికి వెళ్లుతున్న అమ్మాయిలను శనివారం ఓ యువకుడు వేధిస్తుండడంతో స్థానికులు అడ్డుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుందని పోలీసులు తెలిపారు.

నిరుపయోగమైన వస్తువులు ఇచ్చేద్దాం

మేయర్ జక్క వెంకట్ రెడ్డి పిలుపు నిచ్చారు

మేడిపల్లి: రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) అనే పేరుతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.కార్పొరేషన్ పరిధిలో ఇండ్లలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను సేకరిస్తుంది.ఈ కార్యక్రమంలో భాగంగా 26 వార్డుల్లో శనివారం నాడు ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వంశీకృష్ణ ఇతర అధికారులతో కలిసి ఏపీ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌లో ఈ సెంటర్ ను ప్రారంభించారు.అనంతరం మేయర్ మాట్లాడుతూ...చెత్త తగ్గాలంటే వాడిపారేసే వస్తువుల కంటే మళ్లీ మళ్లీ వాడుకో గల వస్తువులకే ప్రాధాన్యమివ్వాలన్నారు. 26 వార్డుల్లో వీటిని ఏర్పాటుచేశామన్నారు.

ట్రిపుల్ ఆర్‌ను సద్వినియోగం చేసుకోండి


ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్


మల్కాజిగిరి డివిజన్‌లో ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: జీహెచ్ఎంసీ చేపట్టిన ట్రిబుల్ ఆర్(రెడ్యూస్,రీ యూజ్, రీ సైకిల్) ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, శ్రవణ్‌లు అన్నారు. శనివారం వారి డివిజన్లలో పరిధిలో కార్యక్రమాన్ని ఎఎమ్‌హెచ్‌ఓ వెంకటేష్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మనకు అవసరం లేని వస్తువులు, దుస్తులు ఉంటాయని వాటిని ట్రిపుల్‌ఆర్ సెంటర్‌లో అందజేస్తే పేదలకు వితరణ చేయడానికి ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్లు మనోహర్‌రెడ్డి, నాగరాజు,ఎస్ఎఫ్ఐలు రాములు,శేఖర్, గిరి,దాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కబ్జా చేస్తున్నారు..చర్యలు తీసుకోండి

కాప్రా: చర్లపల్లి డివిజన్ శివసాయినగర్ రోడ్డు నెంబర్-4లో ఐదు ఫీట్ల సీసీ రోడ్డు కబ్జా అవుతోందని శివసాయినగర్ కాలనీవాసులు కాప్రా సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివసాయినగర్‌లో రోడ్డు కబ్జా అవుతోందని గత నెలలో డిప్యూటీ కమిషనర్, రాచకొండ పోలీస్ కమిషనరేట్, కుషాయిగూడ పోలీసు అధికారులకు వినతులు అందచేశామన్నారు. ఐదు ఫీట్ల మేర సీసీ రోడ్డు కబ్జా అయిందని అధికారులు తేల్చిచెప్పారన్నారు. ఆ స్థలాన్ని కబ్జా చేస్తున్న బిల్డర్‌కు ఓ ప్రజాప్రతినిధి బిల్డర్ పక్షాన ఉంటూ వత్తాసు పలుకుతున్నాడన్నారు. వెంటనే సీసీ రోడ్డును కబ్జా చేసిన బిల్డర్‌కు, ప్రజాప్రతినిధి మద్దతును ఉపసంహరించుకోవాలని వారు కోరుతున్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

అల్వాల్:జూన్‌6న మేడ్చల్‌లో జరిగే మున్సిపల్ రాష్ట్ర తృతీయ మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. శనివారం ఆల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న కెటీఆర్ వాగ్దానం ఇప్పటికీ నెరవేరలేదన్నారు. ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనం తదితర అంశాలపై మహాసభలో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్,రాములు,శేఖర్,నర్సింగ్,గౌతమ్ పాల్గొన్నారు.

సీలింగ్ భూమిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

మేడిపల్లి: ప్రభుత్వ సీలింగ్ భూముల్లో కొనసాగుతున్న కట్టడాలను శనివారం మేడిపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి తన సిబ్బందితో కూల్చివేశారు. సాయిప్రియ నగర్ కాలనీలో పలు నిర్మాణాలను జేసీబీతో నేలమట్టం చేశారు. 118 జీఓ ప్రకారం ఇండ్లు ఉన్నవారికే పట్టాలు ఇవ్వాలి కాని ఓపెన్ పాట్లు ఉన్న వారు సైతం నిర్మాణాలను కొనసాగించడంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. దీంతో నిర్మాణదారులు, మేయర్ కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు అక్కడికి చేరుకొని ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందని రెవెన్యూ అధికారులకు మేయర్ వివరించారు. త్వరలోనే సాయిప్రియకాలనీ సమస్య పరిష్కారం అవుతుందని భరోసా కల్పించారు.

DOCUMENT MISSING

I M Arun Babu S/o. M. Anjaneyulu Aged about 46 Yrs. Occ: Business R/o. Venkateshwara Nagar, Malkajgiri - 047. I Submit that i have lost link Documents i.e., Orginal Agreement of Sale cum General Power of Attorney with possession doct. no. 12433/2018 dated. 05-07-2018. Registered at SRO Uppal, with regarding to the property details given in Affidavit no. 32AA 938617 dated 06-05-2023 was lost while i was travelling by bike from Peerzadiguda to Venkateshwara Nagar, Malkajgiri on 10th Feb 2023. I have Searched above said Document but Traced Inspite of my Best Efforts. If any body found Please Call : 99892 42408.

బ్రాహ్మణ సదనం ప్రారంభోత్సవానికి తరలిరండి


సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘం నాయకులు

మల్కాజిగిరి: దేశంలోనే మొట్టమొదటి సారిగా బ్రాహ్మణుల కోసం తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన బ్రాహ్మణ సదనం ప్రారంభోత్సవానికి బ్రాహ్మణులు పెద్ద ఎత్తున తరలిరావాలని బ్రాహ్మణ సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం మల్కాజిగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సుమారు రూ 13 కోట్ల రూపాయలతో ముఖ్యమంత్రి కెసీఆర్ భవనాన్ని నిర్మించారన్నారు. బ్రాహ్మణ పరిషత్ ద్వారా బ్రాహ్మణులకు చేయూత నందిస్తూ వారికి అండగా ఉంటున్నారని ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సుమలతాశర్మ, మల్లాది చంద్రమౌళి పాల్గొన్నారు.


ఆలయ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి..

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు..

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్, కృష్ణానగర్ కాలనీలోని శ్రీ గోదా తాయారు రంగనాథస్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పాలుపంచుకున్నారు. అనంతరం ఆలయకమిటి ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు.

దొంగల ముఠా అరెస్టు


పోలీసులకు పట్టుబడ్డ నిందితులు

కుషాయిగూడ: తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1.50 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాలను శనివారం అల్వాల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి వెల్లడించారు. మల్కాజిగిరి, నేరేడ్‌మెట్‌కు చెందిన దబిల్‌పురం హేమంత్ (24), జవహర్‌నగర్‌కు చెందిన వరికుప్పల నాగ (19), శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఎలక్ట్రీషియన్ మండ జహంగీర్, కమ్మ నారాయణస్వామి జల్సాలు చేయడానికి డబ్బు కోసం చోరీల బాట పట్టారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుంటారు. రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతూ దోచుకున్న సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డ వారిని విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుల్లో హేమంత్, నాగ, జహంగీర్ పట్టుబడగా నారాయణస్వామి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ వారి వద్ద కేజీ వెండి ఆభరణాలు, రెండు ల్యాప్‌ట్యాబ్స్, రెండు గడియారాలు, ఒక కెమెరా-1 లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657